
అనతి కాలంలోనే
ప్రజల మన్ననలు చూరగొన్న
వన్ నేషన్ దినపత్రికను
చదవండి... చదివించండి....

# వన్ నేషన్

RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 239 ఎడిటర్: కె.యువరాజ్ మంగళవారం 9-6-2026 పేజీలు: 4 వెల: రూ.3/-

వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్థిక
శుభాకాంక్షలు

## సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నాం



ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా, జూన్ 8 (వన్‌నేషన్):** హైదరాబాద్ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నాం: ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న ఆరు ప్రధాన మహానగరాల్లో హైదరాబాద్ ఒకటని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నగర అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

సోమవారం మియాపూర్‌లో నిర్వహించిన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగుళూరు, కలకత్తా, చెన్నై, హైదరాబాద్ నగరాలే దేశ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఇతర మహానగరాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఉదహరిస్తూ, ఢిల్లీలో కాలుష్యం, ముంబైలో వర్షాకాల ముంపు, బెంగుళూరు, చెన్నై, కలకత్తాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. హైదరాబాద్ మహానగరం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నగరాన్ని మూడు కార్పొరేషన్లుగా విభజించినట్లు 4లో




**- 9 మంది సిబ్బంది దుర్మరణం - 1500 డిగ్రీల ఉష్ణోగ్రతతో కుతకుత - అగ్నిగోళం బద్దలైన ట్టుగా మంటలు - బొగ్గుల్లా మారిన మృత దేహాలు - మృతుల కుటుంబాలకు 25 లక్షల పరిహారం - క్షతగాత్రులకు రూ.10 లక్షలు**

**విశాఖపట్నం, జూన్ 8 (వన్‌నేషన్):** విశాఖ ఉక్కు కర్మాగారంలో ఘోర ప్రమాదం జరిగింది. 9 మంది సిబ్బంది మంటల్లో సజీవ దహనమైపోయారు. ఏం జరిగిందో తెలిసేలోపే బొగ్గుల్లా మాడిపోయారు. హాట్ మెటల్ విరుచుకుపడటంతో అగ్నిగోళం బద్దలయినట్లు.. ఆ ప్రాంగణం దాదాపు రెండు గంటలపాటు ఎగసిపడే మంటలతో భీతిగొలిపింది. హాట్ మెటల్‌ను తీసుకెళ్లే ల్యాడిల్ పేలడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఉద్యోగ వర్గాల కథనం ప్రకారం... విశాఖ ఉక్కు కర్మాగారంలోని స్టీల్ మెల్టింగ్ షాపు-1లో సోమవారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో సుమారు 20 మంది సిబ్బంది పని చేస్తున్నారు. లిక్విడ్ స్టీల్‌గా మారడానికి ముందు దశ అయిన హాట్ మెటల్‌ను ల్యాడిల్‌లలో భారీ కొక్కేనికి తగిలించి తరలిస్తారు. ఈహాటల్ మెటల్‌ను శుద్ధి చేసి... 'మౌల్డింగ్'లలోకి ఒంపుతారు. ఒకరకంగా చెప్పాలంటే... ఉక్కు అచ్చులను తయారు చేసే ప్రక్రియ ఇది. ఇలా ల్యాడిల్‌లో తరలిస్తున్న హాట్ మెటల్ ఒక్కోసారి కొద్దిగా ఒలికిపోవడం, చిన్నపాటి ప్రమాదాలు చోటుచేసుకోవడం అరుదుగా జరుగుతుం టుంది. కానీ... 2లో

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి



**న్యూఢిల్లీ, జూన్ 8 (వన్‌నేషన్):** విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో సోమవారం జరిగిన భారీ ప్రమాదంపై ప్రధాన మంత్రి మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలి పారు. క్షతగాత్రులు త్వరగా కోలు కోవాలని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. బాధితులకు అవసరమైన తక్షణ సహాయాన్ని స్థానిక అధికారులు అందజేస్తారని తెలిపారు. ఈ మేరకు ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు.

మృతుల కటుంబాలకు ప్రధాన మంత్రి జాతీయ సహాయక నిధి నుంచి రూ.2 లక్షల పరిహారాన్ని మోదీ ప్రకటించారు. గాయపడిన వారికి రూ.50,000 సాయం అందజేస్తామని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో సోమవారం భారీ ప్రమాదం జరిగింది. ప్లాంట్‌లోని స్టీల్ మెల్టింగ్ స్టేషన్-2 విభాగంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మోల్టెన్ మెటల్ ల్యాడల్ నుంచి బకెట్లు కుప్పకూలాయి. ల్యాడల్‌లో ఉన్న ద్రవ లోహం అకస్మాత్తుగా కిందపడటంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో ప్రమాదస్థలిలో 8 మంది కార్మికులు మృతిచెందగా, మరో ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద వివరాలపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. కార్మికుల మృతిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రమాద కారణాలపై సమగ్ర విచారణ జరుపుతామని ప్రకటించారు.

## 110 కోట్లతో అంబేడ్కర్ నాలెడ్జి సెంటర్

**- నింబోలి అడ్డా హాస్టల్ ఆధునీకీకరణకు రూ.25 కోట్లు - స్థలాలను పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**హైదరాబాద్, జూన్ 8 (వన్‌నేషన్):** తెలంగాణలో సంక్షేమ రాజ్య స్థాపనే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రంలో 'నాలెడ్జ్ విప్లవం' తీసుకొస్తూ, నిరుద్యోగ యువతకు ఉద్యోగ నోటిఫికేషన్లతో పాటు ఉచిత డిజిటల్ కోచింగ్ అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. హైదరాబాద్‌లోని కవాడిగూడ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ భవన్ ప్రాంగణంలో రూ.110 కోట్లతో నిర్మించనున్న పది అంతస్తుల 'బాబాసాహేబ్ డాక్టర్ బీఆర్ అంబేడకర్ నాలెడ్జి సెంటర్', అలాగే కాచిగూడలోని నింబోలి అడ్డాలో రూ.25 కోట్లతో పునర్నిర్మించనున్న మూడు అంతస్తుల ఎస్సీ హాస్టల్ స్థలాలను ఆయన సోమవారం పరిశీలించారు. సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌తో కలిసి వచ్చిన భట్టి, ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వన్ నేషన్
RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని



అనుకుంటున్నారా?
బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా?
అయితే రండి...



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాలు, మండలాల వారీగా పనిచేసే విలేకరులు కావలెను.

9948222240

# ఎకలవ్య ప్రతిభా అవార్డ్-2026

**ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డుల ప్రదానం**




**సికింద్రాబాద్, జూన్ 8 (వన్‌నేషన్):** విద్యా రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన ఎరుకల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'ఎకలవ్య ప్రతిభా అవార్డ్స్-2026' కార్యక్రమం ఆదివారం నగరంలో ఘనంగా జరిగింది. ఎరుకల షెడ్యూల్డ్ తెగల ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని హర్యానా హాల్‌లో ఈ వేడుకను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించి, అవార్డులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. విద్యార్థుల విద్యా ప్రతిభను గుర్తించి వారిని ఉన్నత శిఖరాల వైపు నడిపించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, మాజీ ఎమ్మెల్యే కుర్రా సత్యనారాయణ, బేతంచర్ల డీఎస్పీ పాలకుర్తి మల్లేశంలు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను అభినందించారు. విద్యే సమాజ అభివృద్ధికి అసలైన పునాది అని, విద్యార్థులంతా తమకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. చదువుతోనే పేదరికం జయించగలుగుతామని, జీవితంలో ఉన్నత శిఖరాలు ఎదగడానికి విద్య ఎంతో ముఖ్యమన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ సదానందం మాట్లాడుతూ, ఎరుకల సామాజిక వర్గానికి చెందిన విద్యార్థుల్లో చదువుపై మరింత ఆసక్తిని పెంపొందించడం, వారి ప్రతిభను వెలికితీయడం కోసమే ప్రతి ఏటా ఈ ఎకలవ్య ప్రతిభా అవార్డులను అందజేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత మంది విద్యార్థులకు సంఘం తరఫున ప్రోత్సాహాన్ని అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ వేడుకలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎం. శంకరయ్య, ఉపాధ్యక్షులు డా. వి. నరసింహ, కె. విజయ్ కుమార్, కె. శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కుత్తాడి శ్యామ్ కుమార్, ఖజాంచి కట్టా మదన్ కుమార్, జాయింట్ సెక్రటరీలు ఎస్. బాలనారాయణ, పి. సుధాకర్ రాజు, ఎస్. దుర్గాప్రసాద్‌తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రతిష్ఠాత్మకమైన ఈ అవార్డులను అందుకున్న విద్యార్థులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, తమ ప్రగతికి సహకరించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**- ప్రజావాణి దరఖాస్తులు 77 - జిల్లా కలెక్టర్ - తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట ప్రతినిధి జూన్ 8 (వన్ నేషన్):** ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 43 దరఖాస్తులు, డిడబ్ల్యూఓ 4, డీపీఓ 3, మున్సిపాలిటీ 3 మిగిలిన 24 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని మొత్తం 77 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు.

ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్డిఓ పి డి సన్యాసయ, డిఎంహెచ్ఓ వెంకటరమణ, పిడి హౌసింగ్ సిద్ధార్థ్, సిపిఓ కిషన్ నాయక్, డి ఏ ఓ శ్రీధర్ రెడ్డి, డిఇఓ అశోక్ ,స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు ఇతర జిల్లా అధికారులు తదితరులు హాజరైనారు

# విశాఖ ఉక్కులో ఘోరం

(1వ పేజీ తరువాయి)

సోమవారం ల్యాడిల్ పేలిపోయి 150 టన్నుల దాకా ఉన్న హాట్ మెటల్ ఒక్కసారిగా చుట్టూ విరజిమ్మింది. అగ్నిపర్వతం నుంచి వెలువడే లావా తరహాలో చుట్టుపక్కల 25 అడుగుల వరకు విరుచుకుపడింది. అది పడిన చోటల్లా మంటలు చెలరేగాయి. ల్యాడిల్‌కు పది అడుగుల దూరంలోనే కార్మికులు, సిబ్బందిపై హాట్ మెటల్ పడటంతో భారీగా ప్రాణనష్టం సంభవించింది. హాట్ మెటల్‌ను తరలించే ల్యాడిల్ పేలడం విశాఖ ఉక్కు చరిత్రలోనే కాదు... దేశంలోనే ఇదే మొదటిసారి అని తెలుస్తోంది. దీనికి కారణంపై పలురకాల వాదనలు వినిపిస్తున్నాయి. ఒక కథనం ప్రకారం... హాట్ మెటల్‌లోని మలినాలు తొలగించి, శుద్ధమైన ఉక్కు తయారీ కోసం అల్యూమినియం, ఫెర్రో అలాయ్స్ వంటి కొన్నిరకాల 'మెటల్ యాడిటివ్స్' కలుపుతారు. వాటిని ఆక్సిజన్‌తో 'బ్లో' చేస్తారు. ఈ క్రమంలో ఎక్కడో జరిగిన పొరపాటువల్ల మెటల్‌లో రియాక్షన్ జరిగి పేలుడు సంభవించినట్లు అనుమానిస్తున్నారు. తాజా ప్రమాదంలో భారీగా ప్రాణ నష్టంతోపాటు స్టీల్‌ప్లాంట్‌కు ఆస్తి నష్టమూ వాటిల్లింది. ఎస్ఎంఎస్-1 ప్రాంగణం చాలావరకు అగ్నికీలల్లో చిక్కుకుంది. ఒక క్రేన్ కాలిపోయింది. ఇటీవల ఉక్కు ఉద్యోగులపై పని ఒత్తిడి పెరిగింది. ఎనిమిది గంటలకు బదులు 12 గంటలు డ్యూటీ చేయిస్తున్నారు. ఇటీవల కాలంలో చాలామంది ఉద్యోగులకు వీఆర్ఎస్ ఇచ్చి పంపించేశారు. కాంట్రాక్టు కార్మికులను సగానికి తగ్గించేశారు. వేలాది మందిని తొలగించి 100 శాతం ఉత్పత్తి చేయాలని లక్ష్యం ఇస్తున్నారు. గత నవంబరు నుంచి ఉత్పత్తి ఆధారిత జీతాలను అమలు చేస్తున్నారు.

# ఏరుకల షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తెలంగాణ యొక్క సర్వసభ్య సమావేశం



**సికింద్రాబాద్, జూన్ 8 (వన్‌నేషన్):** ఆదివారం నాడు సికింద్రాబాద్‌లో జరిగిన ఏరుకల షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తెలంగాణ యొక్క సర్వసభ్య సమావేశం. ప్రతిభా పురస్కారాలు, సర్వసభ్య సమావేశ ప్రకటన మరియు హాజరైన జీవితకాల సభ్యులు మరియు విద్యార్థులు 49 మంది హాజరయ్యారు. మొత్తం 250 మంది సభ్యులతో కొత్తగా ఎన్నికైన కమిటీ వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. శ్రీరామ్ సదానందం - అధ్యక్షుడు, కుతాడి విజయ్ కుమార్ - ఉపాధ్యక్షుడు, సోల్లంపల్లి దుర్గాప్రసాద్ - ప్రధాన కార్యదర్శి, కుతాడి శ్యామ్ కుమార్ - సంయుక్త కార్యదర్శి, కట్టా మదన్ కుమార్ - కోశాధికారి. కమిటీ సభ్యులు - 1)శ్రీరామ్ ఆనంద్ ఎల్.ఎల్.బి. 2)కుతాడి. రవి కుమార్. 3)బాణపురం సాయికుమార్ 4)ఎం కృష్ణ. ఎన్నికల అధికారులు: బాల రంగయ్య, వై రామ్ మోహన్ రావు, శ్రీరామ్ జ్ఞానేశ్వర్.

# రైతులకు లాభసాటి పంటలపై అవగాహన కల్పించాలి

**జిల్లా కలెక్టర్ - తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట ప్రతినిధి జూన్ 8 (వన్ నేషన్):** తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకే 'ప్రజా పాలన ప్రగతి నివేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. సూర్యాపేట మండలం రామన్నగూడెం గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఇందులో భాగంగానే 99 రోజుల పాటు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజా పాలనలో భాగంగా అధికారులు నేరుగా ప్రజల వద్దకే వెళ్లి, వారి సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరిస్తారని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేరాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.

**వరికి ప్రత్యామ్నాయంగా లాభసాటి పంటలు**

ప్రస్తుత సీజన్‌లో మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు సాంప్రదాయ వరి సాగుకు ప్రత్యామ్నాయంగా లాభసాటిగా ఉండే ఇతర పంటలపై దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. రానున్న వర్షాకాలంలో ఎల్నీనో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని గుర్తుచేశారు. వర్షాలు సకాలంలో పడకపోతే, వరి పంట చేతికొచ్చే సమయానికి ఆశించిన దిగుబడి రాక రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ నష్టాలను నివారించేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా.. విడతల వారీగా ఎలాంటి ప్రత్యామ్నాయ పంటలు వేస్తే లాభదాయకంగా ఉంటుందో వ్యవసాయ అధికారులు రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తారని కలెక్టర్ తెలిపారు. ఓటర్ జాబితాలో పేరు నమోదు కోసం తమ ఇళ్లకు వచ్చే బీఎల్ఓల దగ్గర ఎన్యుమరేషన్ ఫామ్ పూర్తి చేసి అందించాలని కోరారు. అలాగే, పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే వారికి నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం అందడం ఎంతో కీలకమని, ఆ దిశగా తల్లిదండ్రులు, అధికారులు కృషి చేయాలన్నారు. రాబోయే రోజుల్లో రామన్నగూడెం గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచి, ఒక ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

**ఈ నెల 25 లోపు బిల్లులు సమర్పించాలి**

గ్రామంలోని వార్డుల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను ఈ నెల 25వ తేదీ లోపు సబ్మిట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, ఎంపీడీవో బాలకృష్ణ, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి బోయపల్లి నిరంతర కృషి



**బాలాపూర్, జూన్ 8 (వన్ నేషన్):** మహేశ్వరం నియోజకవర్గం నాదర్గుల్ డివిజన్ 57, అల్మాస్గూడ శేషాద్రి నగర్ కాలనీలో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రోడ్డు సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. కాలనీలో 87 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏబీసీ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, శేషాద్రి నగర్ కాలనీ ప్రెసిడెంట్ కాస సోమయ్య స్థానిక నాయకులతో కలిసి పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. నాదర్గుల్ డివిజన్-57 పరిధిలో బోయపల్లి రాఘవేందర్ రెడ్డి నిరంతరం స్థానిక సమస్యల పరిష్కారం కోసం, శేషాద్రి నగర్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకై ఎప్పటికప్పుడు అధికారులతో సంప్రదింపులు జరుపుతూ, నిధుల మంజూరుకు ప్రత్యేక చొరవ తీసుకున్న ఫలితంగానే సీసీ రోడ్డు పనులు రూపుదాల్చాయని కాలనీ వాసులు మరియు స్థానిక నాయకులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు నవారు మల్లారెడ్డి, దిండు శ్రీనివాస్ గౌడ్, కాలనీ ప్రెసిడెంట్ కాస సోమయ్య, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్, శంకర్, రాకేష్, శంకర్, లక్ష్మీకాంత్ రెడ్డి, జగత్ రెడ్డి, మహేష్, వెంకటేష్ గుప్తా, చంద్రశేఖర్ తదితరులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రపంచ దిగ్గజాలకు విశ్వాసం కలిగేలా "ఫ్యూచర్ సిటీ'

## - కాలుష్యం లేని మహానగరంగా కొత్తపట్టణం నిర్మిస్తాం - జిహెచ్ఎంసి డివిజన్ నాయకులతో కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి



**బాలాపూర్, జూన్ 8 (వన్ నేషన్):** ఫ్యూచర్ సిటీని అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని కారు కూతలు కూసే బీఆర్ఎస్ నేతల మాటలను పట్టించుకోవద్దని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. జిహెచ్ఎంసి పరిధిలోని మీర్ పేట, నందిహిల్స్, జిల్లెలగూడ, బడంగ్ పేట, నాదర్ గుల్, బాలాపూర్ డివిజన్ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో మల్లాపూర్ లోని వైఎఆర్ ఫంక్షన్ హాల్ లో ప్రత్యేక సమావేశం కేఎల్ఆర్ ఏర్పాటు చేశారు. ఈనెల 10న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారత్ ఫ్యూచర్ సిటీ డెవలప్ మెంట్ అథారిటీ, స్కిల్ యూనివర్శిటీ భవనాలను ప్రారంభించనున్నారు. అనంతరం జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ శ్రేణులను కేఎల్ఆర్ కోరారు. ప్రపంచ స్థాయి దిగ్గజ సంస్థలకు నమ్మకం కలిగేలా ఫ్యూచర్ సిటీని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కాలుష్యం లేని మహానగరంగా మార్చేందుకు గ్రీన్ ఫార్మా, పర్యావరణహితమైన సంస్థలకే అనుమతులు ఇస్తున్నట్లు, మహేశ్వరం నియోజకవర్గానికి మైలురాయి కానున్న ఫ్యూచర్ సిటీలో జరిగే సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని కేఎల్ఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఛైర్ పర్సన్ తీగల అనితారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, ఏలిమేటి అమరేందర్ రెడ్డి సహా కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరిశుద్ధ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత..

## - 'స్వచ్ఛాంధ్ర' విజయానికి ప్రజలు,వ్యాపారులు సహకరించాలి..
## - ఎమ్మెల్యే డాక్టర్ బివి.జయనాగేశ్వర రెడ్డి పిలుపు..



**ఎమ్మిగనూరు, జూన్ 8 (వన్ నేషన్):** పట్టణంలో పరిశుభ్రత నిర్వహణను మెరుగుపరిచి,ఎమ్మిగనూరును ఒక ఆదర్శవంతమైన స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు,వాణిజ్య దుకాణదారులు, హోటల్ యజమానులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎమ్మెల్యే డా.బి.వి.జయనాగేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు.కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "స్వచ్ఛ భారత్ మిషన్" ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కొనసాగుతున్న "స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే సూచించారు.గత ఏడేళ్ల నిర్లక్ష్యం వల్ల దెబ్బతిన్న పరిశుభ్రత వ్యవస్థను పునరుద్ధరించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు.పట్టణంలో మున్సిపల్ అధికారులు చేపట్టిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అభినందించారు.మున్సిపల్ డీఈలు నిరంజన్,రాజనాయక్,శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం పలు హోటళ్లు,వాణిజ్య కేంద్రాల వద్ద నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు."పరిశుభ్రత అనేది కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదు,అది మన సామాజిక కర్తవ్యం.కుడిమి ప్రభుత్వం అందిస్తున్న ఈ ముందడుగుకు ప్రజల భాగస్వామ్యం కూడా తోడైతేనే స్వచ్ఛ ఎమ్మిగనూరు సాధ్యమవుతుంది" అని ఎమ్మెల్యే డాక్టర్ బి.వి.జయనాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ ఏఈ కృష్ణ,మెప్మా జేఎంసీ జయవర్ధన్,మున్సిపల్ సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు.

# ఐకాన్ వాకర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం

## ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్.బి.నగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి




**నాగోల్; జూన్, 8 (వన్ నేషన్):** నాగోల్ & బండ్లగూడ ప్రాంతాలకు చెందిన ఐకాన్ వాకర్స్ గ్రూప్ సభ్యులు ఆరోగ్యకరమైన జీవనశైలి, ప్రకృతి పరిరక్షణ మరియు పర్యావరణ అవగాహన లక్ష్యాలతో నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని సుధీర్ రెడ్డి పేర్కొన్నారు."ప్రకృతిని ప్రేమిద్దాం.పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే సందేశంతో ఐకాన్ వాకర్స్ గ్రూప్ సభ్యులు ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కల్పిస్తూ, మొక్కలు నాటడం, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించడం, ఆరోగ్య పరిరక్షణకు నడక యొక్క ప్రాముఖ్యతను వివరించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, పెరుగుతున్న కాలుష్యం మరియు పర్యావరణ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ప్రకృతి సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలమని తెలిపారు.అలాగే ప్రతిరోజూ నడక అలవాటు చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, సమాజంలో ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పెంపొందించేందుకు ఐకాన్ వాకర్స్ గ్రూప్ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఐకాన్ వాకర్స్అ గ్రూప్ అధ్యక్షులు చెరుకు ప్రశాంత్ గౌడ్,జనరల్ సెక్రెటరీ రమేష్ గౌడ్,వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి,కోశాధికారి రమేష్,జాయింట్ సెక్రెటరీ పెంటారెడ్డి,ఆర్గనైజింగ్ సెక్రటరీఈ లక్ష్మీనారాయణ,సలహాదారులు ప్రతాప్ రెడ్డి,తూర్పాటి చిరంజీవి,చెరుకు చిరంజీవి,ఈశ్వర్ గౌడ్ సభ్యులు,సీతారాములు మరియు పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.

# నీటి కష్టాలకు చెక్..కాలనీ వాసుల పక్షాన నిలిచిన తుంగతుర్తి రవి

## అధికారుల కు వినతి!"



**మేడిపల్లి / జూన్ 08 / వన్ నేషన్:** మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ధరణి కాలనీ, మల్లికార్జున నగర్ వాసుల తాగునీటి కష్టాలను తీర్చేందుకు స్థానిక నాయకు డు తుంగతుర్తి రవి గళమెత్తా రు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్వయంగా గమనించిన రవి, సమస్య పరిష్కారం కోసం నేరుగా అధికారుల వద్దకు వెళ్లి తనదైన శైలిలో వినతిని వినిపించారు. ఈ సందర్భంగా ఉప్పల్ జోన్ హెచ్ఎండబ్ల్యూ ఎస్ఎస్బి ఎగ్జిక్యూటివ్ డైరెక్ట ర్ పంకజకు ఆయన ఆధ్వ ర్యంలో కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు.

### ప్రజల గొంతుకగా తుంగతుర్తి రవి:

ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ, "అభివృద్ధి అంటే కేవలం రోడ్లు మాత్రమే కాదు, ప్రజలకు కనీస అవసరమైన తాగునీరు సకాలంలో అందడం కూడా" అని పేర్కొన్నారు. ధరణి కాలనీలో పైప్‌లైన్ లేని ప్రాంతాల్లో కొత్త లైన్ల ఏర్పాటు, మల్లికార్జున నగర్‌లో 150 మి.మీ. డి.ఐ. పైప్‌లైన్ పనులను వెంటనే చేపట్టాలని ఆయన అధికారులను గట్టిగా కోరారు. కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యపై అధికారులతో ఇప్పటికే జరిపిన చర్చలను ఆయన గుర్తు చేశారు.

### అధికారుల హామీ.. కాలనీవాసుల్లో హర్షం

రవి నేతృత్వంలో వచ్చిన కాలనీ వాసుల బృందాన్ని చూసి స్పందించిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పంకజ, సమస్యల పరిష్కారం కోసం సానుకూలంగా స్పందించి, త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలపై తుంగతుర్తి రవి చూపుతున్న చొరవను కాలనీ ప్రతినిధులు, వాసులు అభినందించారు.

ఈ కార్యక్రమంలో జంగా చారి, అంజిరెడ్డి, ధరణి కాలనీ ప్రెసిడెంట్ చింతం చంద్రశేఖర్, జనరల్ సెక్రెటరీ భీమిడి శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గోపిరెడ్డి కృష్ణారెడ్డి, సామ తిరుమలరెడ్డి, మంచాల ప్రకాష్, కారుపోతుల శేఖర్, లింగాల శ్రీనివాస్ గౌడ్, శంకరా చారి, సతీష్, శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో వ్యాయామ విద్యా తప్పనిసరి చేయాలి

## డాక్టర్ బి. లక్ష్మయ్య

**హైదరాబాద్, జూన్ 8 (వన్ నేషన్):** తెలంగాణ రాష్ట్రంలో స్కూల్స్, జూనియర్ కాలేజీ ల్లో వ్యాయామ విద్యా ను తప్పనిసరిగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు డాక్టర్ బి. లక్ష్మయ్య డిమాండ్ చేశారు. తమిళనాడు ప్రభుత్వం ఇటీవల ఆరో తరగతి నుంచి 12 దాకా వ్యాయామ విద్యాను నిర్బంధం పాఠ్యాంశంగా ప్రవేశపెట్టిన విషయం ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూల్లో వ్యాయామ విద్యా ఉపాధ్యాయు(పి.ఈ.టి)ల వేలాది పోస్టులు ఖాళీలుగా ఉన్నాయని ఆయన విచారం వ్యక్తం చేశారు. క్రీడా మైదానం లేని స్కూలు, జూనియర్ కాలేజీల గుర్తింపు రద్దు చేయాలని ఆయన తెలిపారు. తెలంగాణలో వ్యాయామ విద్యా పర్యవేక్షణ అధికారులు లేకపోవడం దురదృష్టకరమన్నారు. దోమలగూడలోని ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో రెగ్యులర్ అధ్యాపకుల లేరని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో దాదాపు 400 పైగా ఫిజికల్ డైరెక్టర్స్ పోస్టులు ఖాళీగా ఉన్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని ఆయన చెప్పారు. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కాలేజ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్స్(పి.డి)ల పోస్టుల భర్తీలో నిర్లక్ష్యం వహించడం పట్ల ఆయన విచారణ వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారు వ్యాయామ విద్యా పై వెంటనే విద్యా శాఖ ఉన్నతాధికార సమావేశం ఏర్పాటు చేసి సత్వరమే రాష్ట్రంలోని ఖాళీ ఉన్న స్కూల్లో ,జూనియర్ కాలేజ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్స్ పోస్టులను భర్తీ చేయాలని ఆయన కోరారు.

# అన్నదాత ఆత్మగానం



కష్టాల కడలిలో కరిగే రైతన్న..!
కన్నీటి కాలువలో కలిసే రైతన్న..!
కొనుగోలు కేంద్రాల్లో కాచే నిరీక్షణ..!
కడగండ్ల వానలకు చెదిరే ఆకాంక్షణ..!
రైతే రాజు అన్నారు రైతన్నా..!
గిట్టుబాటు ధరను నిర్ణయించలేని స్థితిలో నీవెన్నన్నా..!
పచ్చని పొలాల వెనుక నీ త్యాగ గాథను ఎవరు
గమనించారు..?
ప్రతి గింజలో దాగిన నీ జీవన వ్యథను ఎవరు
విన్నారు..?
దేశానికి వెన్నెముకవైన రైతన్నా..!
నీ చిరునవ్వు పూసే ఆ రోజుకై
ఎదురుచూస్తున్న కాలమన్నా ..!

**రచన: మంజుల పత్తిపాటి**
**మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్**
**యాదాద్రి భువనగిరి జిల్లా**
**తెలంగాణ రాష్ట్రం**
**చరవాణి 9347042218**

# వచ్చిన ఫిర్యాదులకు విచారణ జరిపి న్యాయం చేస్తాం

**- కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 112 ఫిర్యాదులు - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి,పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ**



**కర్నూలు, జూన్ 8 (వన్ నేషన్):** కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 112 ఫిర్యాదులు వచ్చాయి.

### వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...

1) తన కుమారుడు సూర్యనారాయణకు ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి ఇద్దరు మహిళలు రూ.3 లక్షలు తీసుకుని మోసం చేశారని పత్తికొండకు చెందిన షేకమ్మ ఫిర్యాదు చేశారు.2) ఈడిగ నరసింహులు గౌడు గ్రామంలో ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద సుమారు 40 మంది నుండి లక్షలలో అప్పులు తీసుకుని తిరిగి చెల్లించకుండా మోసానికి పాల్పడుతున్నాడని కర్నూలు మండలం,జి.సింగవరం గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి,చిట్టెమ్మ,మాజీ సర్పంచ్ నారాయణ, కురవరాజు తదితరులు ఫిర్యాదు చేశారు.3) కడపకు చెందిన గంజికుంట సురేఖదేవి ఒకేషనల్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి రూ.6 లక్షలు తీసుకుని మోసం చేసిందని కర్నూలు,శ్రీరామనగర్‌కు చెందిన చిన్నపుల్లయ్య ఫిర్యాదు చేశారు. 4) తాను రైతుల నుంచి కమిషన్ ఏజెంట్‌గా సేకరించిన 76 బస్తాల మిరప పంటను గుంటూరుకు చెందిన రాంబాబుకు పంపించానని,రూ.7 లక్షలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని,రైతులకు డబ్బులు చెల్లించేందుకు రెండు ఎకరాల పొలం కూడా అమ్మాల్సి వచ్చిందని కల్లూరు మండలం,పెద్దకోట్టాల గ్రామానికి చెందిన మహమ్మద్ హుస్సేన్ ఫిర్యాదు చేశారు.5) తాను నకిలీ పట్టా సృష్టించి భూమి విక్రయించానని ఇద్దరు వ్యక్తులు తప్పుడు ఆరోపణలు చేస్తూ రాజీ చేస్తామని ఇప్పటికే రూ.2 లక్షలు తీసుకుని'ఇంకా రూ.1 లక్ష ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని తాను కొలిమి పని చేసుకుని జీవిస్తున్నానని,వారి బెదిరింపుల వల్ల ప్రాణభయం ఉందని రక్షణ కల్పించాలని పెద్దకడబూరు మండలంకు చెందిన పరమేష్ ఫిర్యాదు చేశారు.6) నేను హైదరాబాద్ మున్సిపాలిటిలో పని చేస్తున్నాను.బజాజ్ కంపెనీలో సెల్‌ఫోన్ కొనుగోలు చేయడానికి వెళ్లిన సమయంలో పరిచయమైన కొందరు వ్యక్తులు కలిసి లక్ష కు ఎక్కువ వడ్డీ ఇస్తామని మొదటగా ఆశ చూపించారు.పొలాలపై రుణాలు ఇప్పిస్తామని 'హైదరాబాద్ పటాన్ చెరువు,జూబ్లీహిల్స్ లలో ఇళ్లు అమ్ముతామని అనంతపురం కు చెందిన ఉపేంద్రతో పాటు మరికొందరు కలిసి తన తరఫున మరికొందరి నుంచి కూడా దశలవారీగా రూ. 5 కోట్ల వరకు డబ్బులు సేకరించి మోసానికి పాల్పడ్డారని తుగ్గలి మండలం, రాంపల్లి గ్రామానికి చెందిన లాలప్ప ఫిర్యాదు చేశారు.7) తన కుమారుడికి కర్నూలు రిజిస్టర్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి రూ.80 వేలు తీసుకుని మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కర్నూలు మండలశీ, దిన్నె దేవరపాడు గ్రామానికి చెందిన మద్దిలేటి ఫిర్యాదు చేశారు.8) వసంత్ కుమార్ తనతో స్నేహపూర్వకంగా వ్యవహరించి,తన ఫ్లాట్ బాండ్ పత్రాలు తీసుకుని,వాటి ఆధారంగా శ్రీరామ్ చిట్స్‌లో రూ.5 లక్షల రుణం తీసుకుని లోన్ డబ్బులు కట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని నా ఫ్లాట్ పత్రాలు తిరిగి ఇప్పించాలని ఎమ్మిగనూరు మండలం, కోటేకల్లు గ్రామానికి చెందిన ఈరన్న ఫిర్యాదు చేశారు ఫిర్యాదు చేశారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి,బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా,సిఐలు శివశంకర్, రామయ్య నాయుడు,రామాంజులు పాల్గొన్నారు.



# బాలానగర్ సీఐ నర్సింహారాజు కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన హెచ్.ఎ.ల్ యూనియన్ నాయకులు

**కూకట్‌పల్లి ప్రతినిధి, జూన్ 8 (వన్‌నేషన్):** బాలానగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ టి.నరసింహారాజు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని వారిని కూకట్పల్లి నియోజక వర్గం ఐ.ఎన్ టి.యు.సి అధ్యక్షులు, హెచ్.ఎ డబ్ల్యు యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్కనాగరాజు ఆధ్వర్యం లో బాలానగర్ పోలీస్ స్టేషన్ లో వారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్ర పటాన్ని వారికి ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కర్కనాగరాజు మాట్లాడుతూ బాలానగర్ పిఎస్ పరిధిలో శాంతిభద్రతలు కాపాడటం లో తన వంతు పాత్రను వహించి ఫ్రెండ్లీ పోలీసింగ్ ను ప్రజలకు చేరువ చేశారు. అదే విధంగా పోలీస్ స్టేషన్ ను ఆధునీకరిం చటం లో కీలక పాత్ర వహించారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా వారిని పోలీస్




మెడల్ కు ఎంపికవటం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ ఆయన పనితనానికి నిదర్శనం అని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్.ఎ.డబ్ల్యూ యూనియన్ ఉపాధ్యక్షుడు కుతాడి కృష్ణ, జాయింట్ సెక్రటరీ వడ్డే నాగార్జున, ఆర్గనైజింగ్ సెక్రటరీ పోలేపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం..!

## - టిడిపి మండల కన్వీనర్ పన్నగ వెంకటేష్ స్వామి



**మంత్రాలయం, జూన్ 8 (వన్ నేషన్):** మంత్రాలయం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు వరమని టిడిపి మండల కన్వీనర్ పన్నగ వెంకటేష్ స్వామి పేర్కొన్నారు.సోమవారం టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి అదేశాల మేరకు పన్నగ హోటల్ లో మంత్రాలయం కు చెందిన బుగజంగం మొండిశాంతమ్మ మంజూరైన రూ 25 సియం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని తెలిపారు.వీరి కి లబ్ధిదారులు శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గురురాజ,వట్టేప్ప చిన్న సుంకప్ప,చెట్నహల్లి ఈరన్న,వట్టేప్ప నర్సింహులు,ఛైర్మెన్ గురురాజ,సున్నం రామకృష్ణ,రాఘు తదితరులు ఉన్నారు.

# సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నాం

(1వ పేజీ తరువాయి)



ముఖ్యమంత్రి తెలిపారు. పోలీస్, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం మెరుగుపడేలా పరిపాలనా సరిహద్దులను నిర్ణయించామని చెప్పారు. జెండాలు, ఎజెండాలకు అతీతంగా నగరాభివృద్ధికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

### విద్య, గృహ నిర్మాణం, మహిళా సాధికారతకు ప్రాధాన్యం

పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పాఠశాలల నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అల్పాహారాన్ని అందిస్తున్నామని చెప్పారు. మహానగరంలో లక్ష LIG, MIG ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని, గతంలో రాజీవ్ గృహకల్ప తరహాలో ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలకే సమీపంలో గృహాలు నిర్మించి అందిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి విముక్తం చేసి పేదల గృహ నిర్మాణానికి వినియోగిస్తామని తెలిపారు. మహిళల సంక్షేమం కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఇందిరా మహిళా శక్తి ద్వారా 150 వాణిజ్య స్టాల్స్ మహిళలకు కేటాయించినట్లు చెప్పారు. మహిళలను పెట్రోల్ బంకుల యజమాను లుగా తీర్చిదిద్దే కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

### మెట్రో విస్తరణ, అంతర్జాతీయ బస్ టెర్మినల్

విశ్వనగరంగా ఎదగాలంటే అందుకు తగిన మౌలిక వసతులు అవసరమని పేర్కొంటూ మెట్రో రెండో దశ విస్తరణ పనులు చేపడుతున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. గాజులరామారంలో సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినల్ నిర్మించనున్నట్లు ప్రకటించారు. మూడు నెలల్లో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

### తెలంగాణకు కేంద్ర నిధులపై బీజేపీ ఎంపీలను ప్రశ్నించిన సీఎం

తెలంగాణ నుంచి ఎన్నికైన బీజేపీ ఎంపీలు రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంలో ఎందుకు చొరవ చూపడం లేదని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. కేంద్ర మంత్రి శ్రీ కిషన్ రెడ్డి తెలంగాణ అభివృద్ధికి అవసరమైన నిధుల సాధనలో ముందుండాలని సూచించారు. గుజరాత్‌లో సబర్మతి నది అభివృద్ధిని ప్రశంసించే వారు, తెలంగాణలో మూసీ నది అభివృద్ధి కార్యక్రమాలను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని కోరారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన, కేంద్రంలోని పన్నెండేళ్ల బీజేపీ పాలన, ప్రస్తుతం 30 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై బహిరంగ చర్చకు సిద్ధమని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఎవరు రాష్ట్రానికి ఎంత అభివృద్ధి చేశారో, ఎన్ని నిధులు తెచ్చారో ప్రజల ముందే చర్చిద్దామని అన్నారు.

### రాబోయే 24 నెలలు అభివృద్ధికే అంకితం

రాష్ట్ర ప్రభుత్వం రాబోయే 24 నెలలు పూర్తిగా అభివృద్ధి కార్యక్రమాలపైనే దృష్టి సారిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. రాజకీయాలకు అతీతంగా హైదరాబాద్ నగరాన్ని, తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

### ముఖ్యమంత్రి ప్రసంగంలోని ముఖ్యాంశాలు:

దేశ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్న ఆరు ప్రధాన మహానగరాల్లో హైదరాబాద్ ఒకటి. భవిష్యత్ అవసరాల దృష్ట్యా హైదరాబాద్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించాం. మెట్రో రెండో దశ విస్తరణ పనులు చేపడుతున్నాం. గాజులరామారంలో 100 ఎకరాల్లో అంతర్జాతీయ బస్ టెర్మినల్ నిర్మాణం. మహానగరంలో లక్ష LIG, MIG గృహాల నిర్మాణానికి ప్రణాళిక. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు. విద్యార్థులకు పాఠశాల నుంచి ఇంటర్ వరకు అల్పాహార పథకం అమలు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 150 వాణిజ్య స్టాల్స్ కేటాయింపు. తెలంగాణకు కేంద్ర నిధుల సాధనలో బీజేపీ ఎంపీలు చొరవ చూపాలి.

### రాబోయే 24 నెలలు పూర్తిగా అభివృద్ధి కార్యక్రమాలకే అంకితం.

ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, అనిల్ కుమార్ యాదవ్, శాసనసభ్యులు మల్రెడ్డి రంగారెడ్డి అరికెపూడి గాంధీ, ప్రభుత్వ సలహాదారులు కార్పొరేషన్ చైర్మన్లు ప్రజాప్రతినిధులు అధికారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ**, RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**